## సీఎంను కలిసిన గ్రంథాలయ సంస్థ చైర్మన్



బొంరాస్‌పేట, అక్టోబర్ 3 : వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమితులైన శేరి రాజేశ్‌రెడ్డి గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. తనను గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా నియమించినందుకు రాజేశ్‌రెడ్డి సీఎంకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించినట్లు రాజేశ్‌రెడ్డి తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరినట్లు రాజేష్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ బొంరాస్‌పేట మండల అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, పార్టీ నాయకులు వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు వికారాబాద్ మీదుగా సంగారెడ్డికి టార్చ్ రిలే ప్రోగ్రాం

వికారాబాద్, అక్టోబర్ 3 : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి సీఎం కప్ 2024 నిర్వహించడానికి నిశ్చయించారని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి హనుమంతరావు తెలిపారు. క్రీడల పట్ల ఉత్సాహాన్ని పెంచుటకు టార్చ్ రిలే ప్రోగ్రాంను ముఖ్యమంత్రి మూడో తేదీన ప్రారంభిస్తారు. అనంతరం టార్చ్ రిలే ర్యాలీ నాలుగో తేదీ ఉదయం 7 గంటలకు వికారాబాద్ కలెక్టరేట్ కార్యాలయం నుంచి సంగారెడ్డి జిల్లాకు బయలుదేరనున్నట్లు తెలిపారు. వికారాబాద్ కలెక్టరేట్ కాంప్లెక్స్ – ఎన్టీఆర్ ఎక్స్ రోడ్ –ఆలంపల్లి–కొత్తగాడి–గేట్ వనంపల్లి ఎక్స్ రోడ్–వెల్చాల్ –మరంగపల్లి–మోమిన్ పేట్–మేకవనంపల్లి–సదాశివపేట–సంగారెడ్డి మీదుగా చేరుకుంటారన్నారు. ఉత్సాహవంతులైన యువతీ యువకులు , స్పోర్ట్స్ పర్సన్, విద్యార్థులు, ఎంప్లాయీస్ క్రీడలపై ఆసక్తి ఉన్నవారందరూ ఈ ర్యాలీలో తప్పకుండా పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

# సాగుకు సన్నద్ధం



- వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతులు
- జిల్లాలో 15 వేల ఎకరాల్లో సాగు

బొంరాస్‌పేట, అక్టోబర్ 3 : వికారాబాద్ జిల్లాలో యాసంగి వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. జిల్లాలోని పలు మండలాల్లో రైతులు వేరుశనగ విత్తనాలు వేసే పనుల్లో బిజీగా ఉన్నారు. ఇటీవల వర్షాలు అనుకూలంగా కురవడంతో రైతులు సాగు పనులకు సన్నద్ధమయ్యారు. వానకాలంలో మెట్ట పొలాల్లో పెసర, బెబ్బెర్లు, మినుములు తదితర పంటలను సాగు చేయగా చేతికి వచ్చాయి. వాటి స్థానంలో యాసంగిలో వేరుశనగను సాగు చేస్తుంటారు. పొలాలను చదును చేసుకుని సిద్ధంగా ఉంచుకున్న రైతులు వర్షాలు కురిసిన వెంటనే విత్తనాలు వేస్తున్నారు. జిల్లాలో సుమారు 15 వేల ఎకరాల్లో వేరుశనగ పంటను రైతులు సాగు చేయనున్నారు. వర్షాకాలంలో సాగు చేసిన వేరుశనగ కంటే యాసంగిలో సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడి అధికంగా వస్తుంది. జిల్లాలోని బొంరాస్‌పేట మండలంలోనే అత్యధికంగా నాలుగు వేలకుపైగా ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేయనున్నారు. వ్యవసాయ బోర్ల కింద ఆరుతడి పంటగా తుంపర్ల పరికరాల ద్వారా నీరందించి దీనిని సాగు చేస్తారు. ఫిబ్రవరి నెలాఖరులో, మార్చి మొదటి వారంలో పంట చేతికి వస్తుంది. దిగుబడి బాగా వస్తే ఎకరాకు ఏడు క్వింటాళ్ల వరకు వస్తుంది. మార్కెట్‌లో క్వింటాలు వేరుశనగకు రూ.6 వేల వరకు ధర పలుకుతుంది.

ప్రభుత్వం వేరుశనగ విత్తనాలను రైతులకు గతంలో రాయితీపై అందించేది. రాయితీ విత్తనాల సరఫరా నిలిచిపోవడంతో రైతులు బయట మార్కెట్‌లో విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. గతంలో విత్తనాల కోసం వేరుశనగ కాయలను కొనుగోలు చేసి మరల్లో నూర్పిడి చేసి వచ్చిన పలుకును పొలంలో విత్తనాలుగా వేసేవారు. ఇదంతా ప్రయాసతో కూడుకున్నది కావడంతో రైతులు నేరుగా పలుకులనే కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్‌లో క్వింటాలు పలుకులకు రూ.12 నుంచి రూ.13 వేల వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు.

### కనిపించని నాగళ్లు

వేరుశనగ విత్తనాలు వేయడానికి రైతులు ఎద్దులతో నాగళ్లను ఉపయోగించేవారు. రానురాను పశు సంపద తగ్గడం, నాగళ్లతో విత్తనాలు వేస్తే ఎక్కువ రోజులు సమయం తీసుకుంటుండడంతో ట్రాక్టర్లను వినియోగిస్తున్నారు. గంట వ్యవధిలో ఎకరా పొలంలో విత్తనాలు వేస్తుండగా.. రూ.1500 చెల్లిస్తున్నారు. విత్తనాలు వేయడానికి ట్రాక్టర్లు రావడంతో ఎక్కడా నాగళ్లు కనిపించడంలేదు.

### పంటలకు పందుల బెడద

రైతులు ఎన్నో ఆశలతో సాగు చేసే వేరుశనగ పంటకు అడవి పందుల బెడద తప్పడంలేదు. విత్తనాలు వేసినప్పటి నుంచి అడవి పందులు పొలాల్లో పడి పాడుచేస్తుంటాయి. ముఖ్యంగా పంటకు ఊడలు దిగి కాయ గట్టిపడే సమయంలో పంటను నాశనం చేస్తుంటాయి. పందులను తరమడానికి రైతులు పొలాల వద్ద కాపలా కాస్తుంటారు. పొలం చుట్టూ పాత చీరలను, ఇనుప తీగలను కంచెగా వేసి పంటలను కాపాడుకునే ప్రయత్నం చేస్తుంటారు. అయినా ఎక్కడో ఓ మూలకు గుంపులుగా వచ్చి పంటలపై పడి నష్టం కలిగిస్తుంటాయి.

## రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



ఆలయ నూతన పాకలవర్గ పదవీ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని

తాండూరు రూరల్, అక్టోబర్ 3: శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం నూతన పాలక వర్గ చైర్మన్‌గా పట్లోళ్ల నవీన్ చంద్రారెడ్డి పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయానికి కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి భక్తులు విచ్చేసి మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సౌకర్యాల కల్పనకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కర్నాటక మాజీ మంత్రి అరవింద లింబవళి మాట్లాడుతూ కేరళకు చెందిన పూజారులతో వాస్తు దోషాల నివారణకు చర్యలు తీసుకొని, శ్రీ రేణక ఎల్లమ్మ దేవాలయాన్ని అభివృద్ధి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, నాయకులు ఉత్తమ్‌చంద్, ధారాసింగ్, మాజీ సర్పంచ్ బెడ్డేళ్ళి సాయిలు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కట్టెల జర్నప్ప తదితరులు ఉన్నారు.

### నూతన పాలకవర్గం పదవీ ప్రమాణం

దేవాలయం చైర్మన్‌గా పట్లోళ్ల నవీన్ చంద్రారెడ్డి, సభ్యులుగా పెద్దింటి శాం తప్ప, లాలయ్య, లాల్యానాయక్, బైండ్ల రాజు, ఈశ్వరమ్మ, శ్రీనివాస్‌లు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

# వయోవృద్ధులను అందరూ గౌరవించాలి





సమావేశంలో మాట్లాడుతున్న డీడబ్ల్యూవో కృష్ణవేణి సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది

వికారాబాద్, అక్టోబర్ 3: వయోవృద్ధులను గౌరవించే బాధ్యత మనందరిదని జిల్లా మహిళాశిశు , దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి అన్నారు. గురువారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వయోవృద్ధుల దశ అనేది చాలా గొప్ప దశ అని వీరిని గౌరవించటం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా14567 హెల్ప్ లైన్ నెంబర్ ఏర్పాటు చేసిందని, ఇది ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తుందన్నారు.జిల్లాలో మొత్తం వయోవృద్ధులు 1,09, 658 ఉన్నారని, వారిలో 41,033 వయోవృద్ధులకు నెలకు 2,016 చొప్పున వృద్ధాప్య పెన్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. వయోవృద్ధుల సమస్యల సత్వర పరిష్కారం కొరకు TS senior citizens.cgg.gov.in అనే వెబ్ సైట్ ను ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో వయోవృద్ధులకు ఆదరణ , వసతి కోసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఒక వృద్ధాశ్రమం కొత్తగడిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో చాలా మంది కుటుంబంలోని పిల్లల వల్ల నిర్లక్ష్యం వలన వయో వృద్ధులను ఎవరు పట్టించుకోవడం లేదని, వయోవృద్ధులకు ఎటువంటి సమస్య వచ్చినా తమశాఖను సంప్రదించాలని సూచించారు. వయోవృద్ధుల సహాయం, సమస్యల పరిష్కా రానికి టోల్ ఫ్రీ నెంబర్ 124567కైనా ఫోన్ చేసి సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సంగమేశ్వర్, చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ మెహరున్నీసా బేగం, కాంతారావు , ప్రవీణ,వెంకటేశ్వరమ్మ, రజిత, సీనియర్ అసిస్టెంట్, జహీరుద్దీన్, రాములు, ఎఫ్ ఆర్ ఓ వెంకటేష్ , మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది , జిల్లా లోని వయోవృద్ధులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వికారాబాద్, అక్టోబర్ 3 : జిల్లాలో వివిధ SA, LP, PET, PD, SGT పోస్టులకు గాను 1:3 నిష్పత్తిలో ఎంపికైన అందరి అభ్యర్థుల జాబితా వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ గురువారం అధికారిక వెబ్‌సైట్లో వెల్లడించారు. కావున 1:3 జాబి తాలో ఉన్న అన్ని సబ్జెక్టుల అభ్యర్థులు వెం టనే సర్టిఫికెట్ వెరిఫికేషన్ వారికి కేటా యించిన సెంటర్లు అనగా ఎస్‌జీటీ పోస్టు లకు డైట్ కళాశాల వికారాబాద్, ఎస్‌ఏ, ఎల్‌పీ, పీఈటీ, పీడీ పోస్టులకు జడ్పీ హెచ్‌ఎస్ శివారెడ్డిపేట్ పాఠశాలలో శుక్ర, శనివారాల్లో ఉద యం 10 గంటల నుం చి సాయంత్రం 5 గంటల వరకు నిర్వ హిం చనున్నట్లు తెలిపారు. వెరిఫికేషన్ సమ యం రెండు రోజులే ఉన్నందున అభ్యర్థు లందరూ త్వరగా వారి సర్టిఫి కెట్ వెరిఫి కేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు.

## ఫ్యామిలీ డిజిటల్ సర్వే ప్రారంభం



కుడుగుంటలో ఫ్యామిలీ డిజిటల్ సర్వేలో అదనపు కలెక్టర్ శ్రీధర్

మర్పల్లి, అక్టోబర్ 3 : మండల పరిధిలోని కుడుగుంట గ్రామంలో ఫ్యామిలీ డిజిటల్ సర్వేను అదనపు కలెక్టర్ శ్రీధర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రయోగాత్మకంగా అమలు చేయుట కొరకు మండలంలోని కుడుగుంటను పైలెట్ గ్రామంగా ఎంపిక చేసినట్లు తెలిపారు. అధికారులు సర్వేకు వచ్చిప్పుడు గ్రామస్తులు సహ కరించాలని, ఎంతమంది ఉన్నారనే వివరాలను తెలుపాలని, కుటుంబ సభ్యుల గ్రూప్‌ఫొటో తీసుకుంటారని అందరూ ఉండేలా చూడాలని గ్రామస్తులకు సూచించారు.కార్యక్రమంలో ఎంపీడీవో రాజమల్లయ్య, తహసీల్దార్ మునిరోద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సురేశ్ యాదవ్, నాయకులు రాములు యాదవ్, కృష్ణారెడ్డి, రామేశ్వర్, దివాకర్, మహేశ్, సురేశ్ పాల్గొన్నారు.

## అధైర్యపడొద్దు..అండగా ఉంటాం



కుల్కచర్ల, అక్టోబర్ 3 : మండల పరిధిలోని పుట్టాపహాడ్ బీఆర్‌ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు యాదయ్య తండ్రి అంజిలయ్య అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి గురువారం అంజిలయ్యను పరామర్శించారు. అధైర్యపడవద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఆయన వెంట రైతు బంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు రాజు, మాజీ వైస్ ఎంపీపీ రాజశేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ తులసిరామ్, నాయకులు అంజిలయ్య, శ్రీశైలం, రాములు ఉన్నారు.



వికారాబాద్, అక్టోబర్ 3 : 68వ ఎస్‌జీఎఫ్ ఐ అండర్ 14, అండర్ 17 బాల,బాలికలకు జిల్లా స్థాయి తైక్వాండో టోర్నమెంట్ , సెలక్షన్స్ గురువారం వికారాబాద్ పట్టణంలోని తేజ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ రాఘవ నాయక్ , జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ అనంతయ్య, మాజీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నర్సింహులు, ఫిజికల్ డైరెక్టర్ ఆనందం , రాష్ట్ర తైక్వాండో ఉపాధ్యక్షుడు గోపాలకృష్ణ కోచ్ గోపాలకృష తల్లిదండ్రులు టెక్నికల్ అఫీషియల్స్ సభ్యులు పాల్గొన్నారు.

# కుటుంబాల వివరాలు సేకరించాలి



పరిగి: వివరాలు పరిశీలిస్తున్న ఆర్‌డీవో వాసుచంద్ర

పరిగి, అక్టోబర్ 3 : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకి పూర్తి వివరాలు సేకరించాలని వికారాబాద్ ఆర్‌డీవో వాసుచంద్ర సూచించారు. పైలెట్ ప్రాజెక్టుగా పరిగి మున్సిపాలిటీలోని 13వ వార్డులో గురువారం సర్వే ను ఆర్‌డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి కుటుంబంలోని వారి వివరాలన్నీ సేకరించాల్సిందిగా సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు వివరాల సేకరణ చేపట్టాలన్నారు. 13వ వార్డు పరిధిలో సర్వే పూర్తయినంత వరకు ప్రతిరోజు కార్యక్రమం కొనసాగుతుందని ఆర్‌డీవో పేర్కొన్నారు. సర్వేను నిత్యం పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, కమిషనర్ వెంకటయ్య, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### ఖమ్మంనాచారం ఎంపిక

**దోమ:** మండల పరిధిలోని ఖమ్మంనాచారం గ్రామాన్ని జిల్లా అధికారులు ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. గురువారం ఆర్‌డీవో వాసుచంద్ర పరిశీలించి అధికారులకు సర్వేకు సంబంధించిన సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్‌బాబు, తహసీల్దార్ పురుషోత్తం,ఎంపీవో సోమలింగం, పంచాయతీ కార్యదర్శులు అలీం, విజయ్‌కుమార్, జమీల్, వినో ద్, సీసీ అంజమ్మ, డబ్ల్యూటీ అనిత, ఆశావర్కర్ శోభ, వీవోఏ అలవేలు, మాజీ సర్పంచ్ శాంతకుమార్, నాయకుడు యాదయ్య పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన



దుర్గామాత విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకు వస్తున్న గ్రామస్తులు

దోమ,అక్టోబర్ 3: దసరా నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో దుర్గామాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రహదాత దాసరి రాజేందర్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్యముదిరాజ్, మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీ అనితాయాదయ్యగౌడ్, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట, అక్టోబర్ 3 : తొమ్మిది రోజులపాటు జరిగే దసరా నవరాత్రి ఉత్సవాలు గురువారం బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు దుర్గామాత అమ్మవారిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజించారు. అమ్మవారికి వివిధ రకాల నైవేద్యాలు సమర్పించారు. బొంరాస్‌పేటలోని దుర్గామాత దేవాలయం, పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయంతో పాటు తుంకిమెట్లలో దుర్గామాత మండపాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. తుంకిమెట్లలో హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి, కోస్గి రహదారికి ఇరువైపులా కాషాయ తోరణాలు కట్టి విద్యుత్ దీపాలతో అలంకరించడంతో రహదారులు ప్రయాణికులకు శోభాయమానంగా కనిపిస్తున్నాయి.

## చలో కామారెడ్డిని విజయవంతం చేయాలి



చలో కామారెడ్డి పోస్టర్ విడుదల చేస్తున్న బీకేఎస్ నాయకులు

పరిగి, అక్టోబర్ 3 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీన నిర్వహించే చలో కామారెడ్డి మహాసభను విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు సుబ్బారెడ్డి, వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజేందర్, రాజేందర్‌రెడ్డి, ఉప్పరి రవి, మల్లేశం కోరారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను అమలు చేసేంత వరకు ఉద్యమం చేపడతామని అన్నారు. రూ.2లక్షల వరకు రుణమాఫీ, రైతుభరోసాను ఎకరాకు ఏడాదికి రూ.15వేలు అందించడం, ఇతర అన్ని అంశాలు అమలు చేయాల్సిందిగా పేర్కొన్నారు. కామారెడ్డిలో జరిగే మహాసభకు పెద్ద ఎత్తున రైతులు తరలిరావాలని వారు కోరారు



పరిగి, అక్టోబర్ 3: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా గురువారం పరిగి పట్టణంలోని బహార్‌పేట్ హనుమాన్ మందిర్‌లో దుర్గామాత విగ్రహం ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు జరిపారు. తొలిపూజలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కావలి యాదయ్య, ఆంజనేయులు, సత్యమ్మ, స్వరూప, భాగ్యలక్ష్మి, వెంకటేశ్, పవన్, భక్తులు పాల్గొన్నారు.



వికారాబాద్, అక్టోబర్ 3 : జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా గురువారం వికారాబాద్ అటవీ శాఖ కార్యాలయంలో అక్టోబర్ రెండవ తేదీ నుంచి 8వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో స్వామి నారాయణ్ గురుకుల విద్యార్థులకు ఫారెస్ట్ సిబ్బంది అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పల్లె ప్రాంతాలు వ్యవసాయ క్షేత్రాలలో ముఖ్యంగా వర్షాకాలంలో పాముల సమస్యలను దృష్టిలో ఉంచుకొని పాములు వాటిని రెస్క్యూ చేసే విధానం పైన ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీ హైదరాబాద్ సభ్యులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాము కరిచినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు.

## ఘనంగా ధ్వజారోహణం..



వికారాబాద్, అక్టోబర్ 3 : వికారాబాద్ ఆలంపల్లి శ్రీ అనంత పద్మ నాభ స్వామి దేవాలయంలో దసరా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయని ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్‌లు తెలిపారు. సాయంత్రం ధ్వజారోహణం, ఇతర పూజలు చేసినట్లు వెల్లడించారు.

